ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 6 మే 2024

ధర్మవరం సభకు పోటెత్తిన జనం | అగ్రనేతల ప్రసంగాలతో ఉత్సాహం | వైసీపీ అరాచకాలపై ధ్వజమెత్తిన నేతలు | చప్పట్లు, కేరింతలతో జనం హర్షం



అమిత్ షా, చంద్రబాబు అభివాదం

ప్రజాగళం.. ప్రభంజనం

బాబు.. షా.. సూపర్ షో..




ముస్లిం మహిళ ఉత్సాహం..

మార్మోగిన భారత్‌మాతాకీ జై నినాదం


అమిత్‌షాతోపాటు బీజేపీ నాయకుల ప్రసంగాల ముందు భారత్‌మాతాకీ జై అంటూ చేసిన నినాదాలకు జనం గొంతు కలపడంతో సభాప్రాంగణం హోరెత్తింది. ఆద్యంతం అమిత్‌షా ప్రసంగాన్ని జనం ఆసక్తిగా విన్నారు. అమిత్‌షా హిందీ ప్రసంగాన్ని సత్యకుమార్ యాదవ్ తెలుగులోకి అనువదించారు. కార్యక్రమంలో కూటమి అసెంబ్లీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, రాప్తాడు కూటమి అభ్యర్థి పరిటాల సునీత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు వరుణ్, బీజేపీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు జీఎం శేఖర్, సందిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సత్యకుమార్ మాకు ఎంతో కావాల్సిన వాడు



సత్యకుమార్ యాదవ్ తమకు ఎంతో కావాల్సిన వాడనీ, ఎన్నో ఏళ్ల సన్నిహితం ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ఎంతో నమ్మకస్తుడన్నారు. ఆయనను గెలిపించుకుంటే ధర్మవరం అభివృద్ధికి సహకరిస్తానని భరోసా ఇచ్చారు. ఎంపీ అభ్యర్థి పార్థసారథిని కూడా గెలుపించుకుంటే నరేంద్రమోదీ, చంద్రబాబు నాయకత్వంలో దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు.

పరిటాల శ్రీరామ్‌కు సరైన గుర్తింపునిస్తా



పొత్తులో భాగంగా ధర్మవరం ఎమ్మెల్యే స్థానాన్ని బీజేపీకి ఇవ్వాల్సి వచ్చిందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ధర్మవరం ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా ధర్మవరంలో ప్రజల పక్షాన పరిటాల శ్రీరామ్ పోరాటం చేశారన్నారు. పొత్తులో శ్రీరామ్‌కు టిక్కెట్ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిటాల శ్రీరామ్ త్యాగం చేశాడన్నారు. తప్పకుండా తగిన గుర్తింపు ఇచ్చే బాధ్యత తనదన్నారు. రాజకీయంగా మంచి భవిష్యత్తు ఇస్తానని పేర్కొన్నారు.

కేతిరెడ్డి అవినీతి సామ్రాజ్యాన్ని పెకలించి వేస్తా



ధర్మవరాన్ని అధర్మవరంగా మార్చేసిన దుర్మార్గుడు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పట్టుకేంద్రాన్ని అరాచక శక్తులకు అడ్డాగా మార్చాడు. గుడిని, బడిని, మట్టిని, ఇసుకను మింగేసిన అక్రమార్కుడు. కొండలు, చెరువులు, స్థలాలు, భూములు, రోడ్లను సైతం వదల్లేదు. కేతిరెడ్డి అరాచకాలకు అంతం పలికే రోజులు చాలా దగ్గరలోనే ఉన్నాయి. ధర్మవరంలో కేతిరెడ్డి అవినీతి సామ్రాజ్యాన్ని పెకలించివేస్తా. ఇక్కడి ప్రజలకు ధర్మమైన పాలన అందిస్తా. ధర్మవరం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డును నిర్మిస్తాం. చేనేత క్లస్టర్, టెక్స్‌టైల్ ప్రాసెసింగ్ యూనిట్‌ను తీసుకొస్తా. పరిశ్రమలను ఏర్పాటు చేయించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తా. హంద్రీనీవా ద్వారా చెరువులన్నింటినీ నింపి, రైతులకు సాగునీటి సౌకర్యం కల్పిస్తా.

- సత్యకుమార్ యాదవ్, ఉమ్మడి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి

ధర్మవరంలో బీజేపీ జెండా రెపరెపలాడాలి



కష్టకాలంలో ధర్మవరం ప్రజలకు పరిటాల శ్రీరామ్ అండగా నిలిచారు. పొత్తులో భాగంగా ఎమ్మెల్యే టికెట్ బీజేపీకి ఇవ్వాల్సి వచ్చింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ చాలా గట్టివాడు. అందరి సమష్టి కృషితో ధర్మవరంలో బీజేపీ జెండా రెపరెపలాడాలి. సత్యకుమార్ మంచి మెజారిటీతో గెలిపిస్తే ఇక్కడి చేనేతలను ఆదుకుంటాడు. కేంద్రం పెద్దలతో మాట్లాడి ధర్మవరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే సత్తా సత్యకుమార్‌కు ఉంది. ఎమ్మెల్యే కేతిరెడ్డి అక్రమాలు, దౌర్జన్యాలు తప్ప.. అభివృద్ధి చేసిందేమీ లేదు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే అందరూ కష్టపడి పనిచేయాలి.

- పరిటాల సునీత, రాప్తాడు కూటమి అభ్యర్థి



ధర్మవరం, ధర్మవరంరూరల్/కొత్తచెరువు, మే5: ప్రజాగళం సభ ప్రభంజనమై సాగింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రసంగాలతో దద్దరిల్లిపోయింది. అగ్రనేతలను చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. ధర్మవరంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం వికసిత్ ఆంధ్ర-వికసిత్ భారత్ సభకు జనం పోటెత్తారు. కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ తరఫున ప్రచార బహిరంగ సభలో అగ్రనేతలు అమిత్‌షా, చంద్రబాబు ప్రసంగాలు అభిమానుల్లో ఉత్సాహం నింపాయి. వారిరువురు ప్రసంగిస్తున్నంతసేపు కేరింతలు, చప్పట్లు కొడుతూ, ఈలలు వేస్తూ సభకు హాజరైన వేలాదిమంది జనం హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన తరువాత ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మవరంలో సభ ఏర్పాటు చేశారు. ఉదయం నుంచే ధర్మవరం మార్కెట్ యార్డు సమీపంలోని సీఎన్‌బీ కల్యాణమండపం వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి కూటమి శ్రేణులతో పాటు జనం భారీగా తరలివచ్చారు. అనుకున్న సమయాని కంటే గంటన్నర ఆలస్యంగా సభ ప్రారంభమైనా జనం కదలకుండా కూర్చున్నారు. ఉత్సాహంగా సభ సాగింది. సభావేదికపైకి అమిత్‌షాతోపాటు చంద్రబాబు నాయుడు రాగానే జనం హర్షధ్వానాలతో స్వాగతించారు. మొదట హోంమంత్రి అమిత్‌షా ప్రసంగం ప్రారంభించారు. జిల్లాలోని లేపాక్షి శ్రీరామచంద్రప్రభువు.. జటాయువును కలిసిన పుణ్యభూమి అనీ, శాంతి, ధ్యానం, సత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన సత్యసాయి బాబా నడయాడిన నేల పుట్టపర్తి అని కొనియాడారు. పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏపీలో గూండాగిరీ, అవినీతి, అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని దించడానికే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డామని స్పష్టం చేశారు. మోదీ, చంద్రబాబును గెలిపిస్తే రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. అమిత్‌షా వాగ్ధాటితో జనాల్లో ఉత్సాహం నింపారు. అమిత్‌షా.. చంద్రబాబునాయుడును పిలిచి ప్రత్యేకంగా సత్కరించారు. చంద్రబాబు ప్రసంగంలో రాష్ట్రంలో అరాచకపాలన, అవినీతి, దాడులను ఎండగట్టారు. పారిశ్రామిక, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకపోవడం పట్ల జగన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కూటమిదే అధికారమనీ, సర్వేలన్నీ ఇదే విషయం చెబుతున్నాయనీ, అధికారంలోకి పక్కాగా రాబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ఏర్పడిన తరువాత ఎన్నికల ప్రచారంలో భాగంగా ధర్మవరంలో ప్రజాగళం సభకు ఇద్దరు అగ్రనేతలు హాజరై, ప్రసంగించడంతో రాష్ట్రమంతా ధర్మవరంవైపు చూసింది. బీజేపీ, టీడీపీ, జనసేన జెండాలు, కటౌట్లతో ధర్మవరం రహదారులన్నీ నిండిపోయాయి. సభకు ముస్లిం మహిళలు పెద్దఎత్తున తరలిరావడం గమనార్హం. సభాప్రాంగణంతోపాటు అనంతపురం, బత్తలపల్లికి వెళ్లే రహదారులు జనంతో కిక్కిరిసిపోయాయి.



చెయ్యెత్తి.. జై కొట్టు..



కేరింతలు

సంబరాలు





ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలి

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోంది. దీనికి వెంటనే చరమగీతం పాడాలి. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకోవాలి. 60 ఏళ్ల తరువాత ధర్మవరంలో బీసీ వర్గానికి చెందిన సత్యకుమార్‌కు అవకాశం వచ్చింది. బీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి, గెలిపించుకోవాల్సి ఉంది. సత్యకుమార్‌కు అవకాశం ఇస్తే చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకొస్తారు.

- అంజినప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ధర్మానికి, అధర్మానికి మధ్య సాగుతున్న ఎన్నికలు

జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైంది. అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. దుర్మార్గపు పాలనను అంతమొందించాల్సిన సమయం వచ్చింది. సైకో జగన్‌ను సముద్రంలో పడేయాల్సిన బాధ్యత ప్రజలదే. ధర్మానికి, అధర్మానికి మధ్య సాగుతున్న ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థులకు ప్రజలందరూ సంపూర్ణ మద్దతు తెలపాలి. ధర్మవరం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన సత్యకుమార్ యాదవ్‌ను ఆదరించండి. కేంద్రంతో మంచి సంబంధాలున్న వ్యక్తి. అలాంటి వ్యక్తిని ధర్మవరం ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకుంటే ఈ ప్రాంతానికి ఎంతో మేలు చేకూరుతుంది. అవినీతి చక్రవర్తి కేతిరెడ్డి గుడ్ మార్నింగ్ పేరుతో తిరుగుతూ ఎక్కడ విలువైన ఆస్తులు కనిపిస్తే వాటిని కాజేశాడు.

- బీకే పార్థసారథి, కూటమి ఎంపీ అభ్యర్థి





మంచిరోజులు వస్తున్నాయి

వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మరో వారం రోజులు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయండి. త్వరలో మంచి రోజులు వస్తున్నాయి. సత్యకుమార్ యాదవ్‌ను మంచి మెజారిటీతో గెలిపించుకుంటే బ్రహ్మాండమైన అభివృద్ధి చేస్తారు. చేనేతలను ఎలా ఆదుకోవాలన్న అవగాహన ఉన్న నాయకుడు. రైతాంగాన్ని ఎలా కాపాడుకోవాలో తెలిసిన నేత. ధర్మవరానికి పరిశ్రమలు తీసుకురావాలని తపిస్తున్నారు.

- పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి



వేదికపై నాయకుల ఐక్యతారాగం..



పోస్టల్ బ్యాలెట్‌కు మరో 3 రోజులు..

పుట్టపర్తి, మే 5: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు మూడురోజులు అవకాశం ఇస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన ఓపీఓలకు, అత్యవసర సేవల ఉద్యోగులకు 8న పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తామన్నారు. పోలీసు సిబ్బందికి 7, 8, 9 తేదీల్లో, మీడియా ప్రతినిధులతో పాటు ఇతర శాఖలకు సంబంధించినవారు జిల్లా కేంద్రంలోని సాంఘిక, సంక్షేమ బాలుర వసతి గృహంలో 8న ఓటు వేయాలన్నారు, పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోనివారుకూడా డ్యూటీ ఆర్డర్ కాపీ, గుర్తింపు కార్డుతో సంబంధిత ఫెషిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటు వేయచ్చని సూచించారు.



నీటి కష్టం..!

తీవ్ర వర్షాభావం, బోర్లలో నీటిమట్టం పడి పోవడంతో జిల్లాలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. నంబులపూలకుంట మండలంలోని కటకంవారిపల్లిలో నెల రోజులుగా తాగునీటి కోసం తిప్పలు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో 70 కుటుంబాలున్నాయి. అందరూ పశుపోషణ మీదే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గ్రామంలో ఉన్న రక్షిత తాగునీటి బోరు నుంచి నీరు రావట్లేదు. చేతిపంపు కూడా మరమ్మతులకు లోనైంది. సమీపంలో వ్యవసాయ బోర్లు లేకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు సమస్య విన్నవించినా పట్టించుకోలేదని మండిపడ్డారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు స్వచ్ఛందంగా ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేయడంతో గ్రామస్థులు చుట్టుముడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. **- నంబులపూలకుంట**



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

ఓటేశాం..

ఓటేసినట్లు సిరా గుర్తును చూపుతున్న బ్రహ్మానందరెడ్డి



గాండ్లపెంట, మే 5: మండలంలోని దివ్యాంగులు, 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. జిల్లాలో ఇలా 21 మందికి అవకాశం కల్పించగా.. వారిలో 15 మంది ఓటేసినట్లు తహసీల్దార్ శ్రావణి తెలిపారు. వంకపల్లికి చెందిన దివ్యాంగుడు బ్రహ్మానందరెడ్డి ఇంటివద్ద పోలింగ్ అధికారులు, ప్రత్యేక సిబ్బంది వెళ్లి పోస్టల్ బ్యాలెట్ పత్రం ద్వారా ఓటు వేయించుకున్నారు. తాను ఓటు వేసినట్లు అతడు చేతికి వేసిన శిరా గుర్తును చూపారు.





హిందూపురంలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న వృద్ధులు

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	41.0 28.0	41.0 28.0	41.0 29.0	39.0 26.0	40.0 27.0

క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా ఉంచాలి

జిల్లా ఎన్నికల అధికారి

పుట్టపర్తి, మే 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రత్యేక నిఘా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం ఎక్సైజ్, సెబ్ అధికారులతో సమన్వయం సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. సరిహద్దులో అక్రమ మద్యం రవాణాను అరికట్టాలన్నారు. ఇంతవరకు 45.97 లక్షల అక్రమమద్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మద్యం ఉత్పత్తి, రవాణా, నిల్వ, డిపోల ద్వారా కేటాయింపు, ఫాంహౌస్‌లను తనిఖీ చేసి అక్రమ మద్యం రవాణా కాకుండా చూడాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, ఎక్సైజ్ శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అరుణ్‌బాబు

పోస్టల్ బ్యాలెట్‌లో పోలైన ఓట్లు 7,588

కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, మే 5: జిల్లాలో ఇప్పటి వరకు 7,588 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వినియోగించుకున్నట్లు కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 26,150 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈనెల 3 నుంచి జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ చేపడుతున్నామన్నారు. తొలి రెండు రోజులు శుక్ర, శనివారం కలిపి జిల్లా వ్యాప్తంగా 4,521 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మూడో రోజు ఆదివారం అత్యధికంగా జిల్లా వ్యాప్తంగా ఎనిమిది నియోజకవర్గాల్లో కలిపి సాయంత్రం 4-30 గంటల వరకు 3,067 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటు వేశారని కలెక్టర్ వెల్లడించారు. ఈ లెక్కన ఈ మూడు రోజులు రాయదుర్గం నియోజకవర్గంలో 1877 మందికి గాను 480 మంది, ఉరవకొండలో 2,124 కి గాను 647 మంది, గుంతకల్లులో 3,032 కి 988 మంది, తాడిపత్రిలో 2388 మందికి 927 మంది, శింగనమలలో 1810 మందికి 563 మంది, అనంతపురంఅర్బన్‌లో 6,594 మందికి 1846 మంది, కళ్యాణదుర్గంలో 2,566 మందికి 694మంది, రాప్తాడు నియోజకవర్గంలో 3,528 మందికి గాను 1191 మంది ఇప్పటి వరకు పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు వినియోగించుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.



పోస్టల్‌కు బదులు హోమ్ ఓటింగ్ కవర్లు

రాప్తాడు, మే 5: రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ కార్యాలయంలో ఈనెల 3వ తేదీ నుంచి కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ 651 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకున్నారు. సాయంత్రం వరకూ మొత్తం 1200 మంది పీఓ, ఏపీఓ, ఓపిఓలు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. సాయంత్రం దాదాపు 10 మంది ఓటర్లకు పోస్టల్ ఎనవలప్ కవర్లకు బదులు హోమ్ ఓటింగ్ ఎనవలప్ కవర్లు ఇచ్చారు. పోస్టల్‌కు బదులు హోమ్ ఓటింగ్ ఎనవలప్ కవర్ ఎందుకు ఇచ్చారని, ఆ పది ఓట్లు చెల్లుతాయా అని ఆ ఓటర్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నోడల్ అధికారి పరమేశ్వరరావును వివరణ కోరగా.. పోస్టల్, హోమ్ ఓటింగ్ ఎనవలప్ కవర్లలో ఏ ఎనవలప్ కవర్లు ఉపయోగించినా ఓట్లు చెల్లుతాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



పింఛన్ వచ్చినా.. బ్యాంకులో కోత



లక్ష్మీదేవి, ఎగువతూపల్లి

నంబులపూలకుంట, మే 5: పింఛన్‌దారుల కష్టాలు రోజుకొకటి వెలుగులోకి వస్తున్నాయి. బ్యాంకు ఖాతాలో జమ అయినా చేతికి తీసుకోలేక వృద్ధులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. చాలామంది లబ్ధిదారులు బ్యాంకు ఖాతాలు తెరిచి లావాదేవీలు జరపకపోవడంతో జమ అయిన నగదు కోతకు గురైంది. నంబులపూలకుంట మండలంలోని ఎగువతూపల్లికి చెందిన లక్ష్మీదేవికి మే నెలలో ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ.3వేలు బ్యాంకు ఖాతాకు జమ చేసింది. బ్యాంకులో పనిచేసే తమ గ్రామ కోఆర్డినేటర్ వద్దకు వెళ్లి ఆధార్‌కార్డుతో పింఛన్ జమ అయిన విషయం తెలుసుకున్నారు. లక్ష్మీదేవి ఖాతాలో గతంలో రూ.500 ఉండేది. పింఛన్ తీసుకోవడానికి బ్యాంకుకు వెళ్లగా రూ.1500 మాత్రమే ఖాతాలో ఉన్నట్లు సిబ్బంది చెప్పడంతో ఆమె అవాక్కయింది. దీనిపై బ్యాంకు సిబ్బందిని అడుగగా.. ఖాతా తెరచిన తరువాత లావాదేవీలు తప్పకుండా జరపాలని, లేనిపక్షంలో బ్యాంకు నిబంధనల మేరకు డబ్బులో కోత పడుతుందన్నారు.

జగనన్న అమ్మ ఒడి

పిల్లల చదువుల బడి

అమ్మకు మోసం..!

ఆంక్షల పేరుతో 'అమ్మఒడి'లో కోతలు

మాట తప్పి..మడమ తిప్పిన జగన్

ఐదో ఏడాది జమకాని నగదు

ధర్మవరం: 'అక్కచెల్లెమ్మలకు అండగా ఉంటా.. మీ ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అంతమందికి ఏడాదికి రూ.15వేలు చొప్పున అమ్మఒడి ఇస్తాను.. మీరు వారిని మంచి చదువులు చదివించుకోవచ్చు' అని గత ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో జగన్ మాట ఇచ్చి అధికారంలోకి రాగానే మడమ తిప్పేశారు. ఇంట్లో ఎంతమంది ఉన్నా ఒక్కరికే అమ్మఒడి ఇస్తా.. అనేక ఆంక్షలు పెట్టి కోత వేసి అక్క, చెల్లెమ్మలను మోసం చేశారు. ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలలో అమ్మఒడి పథకం ఒకటి. ఈ పథకాన్ని నవరత్నాలలో చేర్చుతున్నట్టు చాలా గొప్పగా చెప్పారు. ప్రతి ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే వారందరికి ఏడాదికి రూ.15వేలు చొప్పున ఇస్తామన్నారు. హామీ ఇచ్చేటప్పుడు ఈ పథకంలో అర్హుల ఎంపికకు ఎటువంటి నిబంధనలు పెట్టబోతున్నారో? ఎక్కడా చెప్పలేదు. ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోగాని జగన్‌రెడ్డి ఈ పథకంపై మొదటిసారి మాట తప్పి మడమ తిప్పేశారు. ఇంట్లో ఒక విద్యార్థికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. మొదట ఏడాది తల్లుల బ్యాంకు ఖాతాల్లో రూ.15వేలు జమచేశారు. రెండో ఏడాది కరోనా కోటాలో అమ్మఒడికి బ్రేక్ పడింది. మూడో ఏడాది జగనన్న మరోసారి మాట తప్పారు. పాఠశాలల మరుగుదొడ్ల నిర్వహణ పేరుతో రూ.15వేలు నుంచి రూ.14వేలకు కుదించారు. అర్హుల ఎంపికలో అప్పటి వరకు లేని కొత్త నిబంధనలు వచ్చి చేరాయి. నాలుగో ఏడాదిలో దానిని రూ.13వేలకు తగ్గించారు. ఐదో సంవత్సరం రూ.13వేలకు బటన్ నొక్కినా తల్లుల ఖాతాలోకి డబ్బు జమకాలేదు. ఎప్పుడో నెల, రెండు నెలల తరువాత (కొందరికి విడతల వారీగా) ఖాతాలోకి పడింది. సత్యసాయి జిల్లా ఏర్పడిన తరువాత 2022-23 సంవత్సరంలో 1లక్ష 69వేల మంది విద్యార్థులకు అమ్మఒడి వచ్చింది. 2023-24 సంవత్సరంలో 1,60,397 మంది విద్యార్థులకు మాత్రమే తల్లుల ఖాతాలోకి జమచేశారు. మిగిలినవారికి నిబంధనల పేరుతో ప్రభుత్వం ఎగనామం పెట్టింది.



ఎన్ని నిబంధనలో..

రాష్ట్ర ప్రభుత్వం 2020 జనవరిలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదట చెప్పిన ప్రకారం తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివే పిల్లలకు అమ్మఒడి పథకం వర్తిస్తుంది. ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు అర్హులు. తల్లి ఆధార్‌కార్డు, విద్యార్థి ఆధార్‌కార్డు ఉండాలి. పాఠశాలలు, కళాశాలల్లో 75 శాతం హాజరుకావాలి. ప్రభుత్వ ఉద్యోగులు అయి ఉండకూడదు. ముందుగా ఇటువంటి నిబంధనలే ఉన్నాయి. తరువాత విద్యుత్ బిల్లులు 300 యూనిట్లకు మించకూడదని, కారు ఉండకూడదని.. వంటి అనేక నిబంధనలు చేర్చారు. ఫలితంగా ఏటా అమ్మఒడి లబ్ధిదారులు తగ్గిపోతూనే ఉన్నారు. కొత్తగా పాఠశాలల్లో చేరే విద్యార్థులతో పోల్చితే అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య పెరగలేదు. దీంతో అమ్మఒడి పథకంపై తల్లులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఒక్కరికే ఇస్తే.. మిగిలిన బిడ్డలూ..?

నాకు ఇద్దరు ఆడబిడ్డలు. వీరిని చదివిస్తున్నా. ఒకరికి మాత్రమే అమ్మఒడి వస్తోంది. నా భర్త బేల్దారి పనులు చేస్తాడు. చాలీచాలని డబ్బుతో పిల్లలను చదివించడం కష్టంగా ఉంది. చంద్రబాబు నాయుడు ఎంత మంది పిల్లలున్నా అందరికీ తల్లికి వందనం కింద రూ.15వేల చొప్పున ఇస్తా అంటున్నారు. ఆ పథకంతో నా పిల్లలు చదివించుకుంటా.

- శ్రీదేవి, ధర్మవరం

ఇన్ని షరతులా..? : స్వర్ణలత, ముదిగుబ్బ

ఇంట్లో చదువుకునే పిల్లలందరికీ అమ్మఒడి పథకం కింద రూ.15వేలు ఇస్తామన్నారు. కానీ ఇంట్లో ఒక్కరికే ఇస్తున్నారు. అది కూడా ఎక్కడా లేని నిబంధనలు పెట్టారు. 75 శాతం విద్యార్థుల హాజరు శాతం ఉండాలంట. 300 యూనిట్లు కరెంటు కాలకూడదంట. రూ.15వేలు అయినా సక్రమంగా ఇచ్చారా? అంటే అదీలేదు. మూడోసారి వేయి, నాలుగోసారి రూ.2వేలు కోత పెట్టారు.

అమ్మఒడి అట్టర్‌ఫ్లాప్ : పెద్దన్న, కొత్తపేట, ధర్మవరం

అమ్మఒడి అట్టర్ ఫ్లాప్ పథకం. కుటుంబం లో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి అమ్మఒడి ప థకాన్ని ఇస్తామని ఎన్నికల సమయంలో జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే ఒకరికి మాత్రమే అని మాట మార్చారు. తరువాత కరెంటు బిల్లులు, ఇన్‌కంటాక్స్, భూములు, స్థలాలు, సొంత ఇళ్లు వంటి నిబంధనలు పెట్టారు. మొదటి సంవత్సరం ఒక్కొక్కరికి రూ. 15వేలు, రెండో సంవత్సరం రూ. 14వేలు, తరువాత దానిని రూ.13వేలకు కుదించారు. ఈ ఐదేళ్లలో మాకు మూడుసార్లు మాత్రమే అమ్మఒడి వచ్చింది. మిగిలిన రెండుసార్లు సాకులతో మొండిచెయ్యి చూపారు.

మూలనపడ్డ మగ్గం

సంక్షోభంలో చేనేత పరిశ్రమ

ప్రభుత్వ ఆదరణ కరువు

గిట్టుబాటు లేక కులవృత్తికి దూరమవుతున్న నేతన్న

ఒకప్పుడు మగ్గం నేసి కుటుంబాన్ని పోషించుకున్న చేనేత కార్మికులు నేడు నేత పనికి దూరమైపోతున్నారు. మరమగ్గాలు రావడంతో చేనేత పరిశ్రమ కుదేలైపోయింది. దీనికి తోడు పాలకులు అవలంబిస్తున్న విధానాలతో చేనేత పరిశ్రమ మరింత సంక్షోభంలోకి కూరుకుపోతోంది. ఒకప్పుడు ఉరవకొండలో మూడువేలకు పైగా మగ్గాలు ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మగ్గాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చాలామంది చేనేత కార్మికులు మగ్గాలను మూలనపడేసి చిన్నచిన్న దుకాణాలు, హోటళ్లలో కూలీలుగా మారిపోయారు.



చేనేత మగ్గం

ఉరవకొండ: వ్యవసాయం తర్వాత అతి పెద్ద రంగమైన చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతోంది. పాలకుల నిర్లక్ష్యం, ప్రభుత్వ విధానాలతో మగ్గం రానురానూ మూలకు చేరుతోంది. మగ్గం పనికి వెన్నెముక లాంటి ఉపవృత్తులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. దీనికి తోడు చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ విధించడంతో గిట్టుబాటు కాక నేతన్నలు అనారోగ్యం, అప్పులు, ఆకలితో అలమటిస్తూ ఇతర వృత్తుల్లోకి పోతున్నారు. ఉరవకొండలో గతంలో మూడువేలకు పైగా మగ్గాలు ఉండేవి. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో మగ్గాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. చేనేతకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. రానురానూ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో మగ్గాలు మూలనపడ్డాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మరీ దారుణంగా తయారయింది.

సంక్షేమ పథకాలకు చెల్లుచీటీ

- ఐసీఐసీఐ లాంబర్డ్ ఇన్సూరెన్స్ పథకాన్ని పూర్తిగా నిలిపివేశారు. ఈ పథకంలో చేనేత కార్మికుడు రూ100లు చెల్లిస్తే ఏడాది పాటు రూ.15వేలు ఆరోగ్య బీమా వర్తించేది.
- బునకర్ బీమా యోజన పథకంలో రూ.80కే ఇన్సూరెన్స్ కల్పించేవారు. ఈ పథకంలో కుటుంబ యజమాని సాధారణ మరణం చెందితే రూ.60వేలు, ప్రమాదవశాత్తు అయితే రూ.1.5 లక్షలు ఇచ్చేవారు. ఈ పథకం కూడా అమలులో లేదు.
- ఎన్‌హెచ్‌డీసీ పథకంలో చేనేత కార్మికుడికి నూలు కొనుగోలుకు 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఈ పథకం అమలులో లేదు.
- ఎన్‌సీడీసీ (నేషనల్ క్రెడిట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పథకంలో కార్మికులకు ముద్రా యోజనా రుణాల కింద రూ.50వేలు బ్యాంకు రుణాలు ఇచ్చే పథకాన్ని కూడా నిలిపి వేశారు.
- గతంలో మగ్గం నేసే కార్మికులకు వర్క్‌షెడ్ కోసం రూ.75వేలు ఇచ్చేవారు.

రాయితీలన్నీ కట్

నూలుపై రాయితీ, పావలా వడ్డీ, రిబేట్‌పథకం, మార్కెటింగ్ ప్రోత్సాహక పథకం నిలిపివేశారు. వీటి వల్ల చేనేత కార్మికులకు ఏడాదంతా చేతినిండా పనితో పాటు కూలీ గిట్టుబాటు అయ్యేది. ఒక్కో చేనేత కార్మికుడికి సుమారు రూ.50వేల ఆదాయం పరోక్షంగా సమకూరేది. దీంతో చేనేత కార్మికుడికి శ్రమకు తగ్గ ఫలితం ఉండేది. వైసీపీ వచ్చిన తర్వాత రాయితీలన్నీ ఎత్తి వేసింది. కానీ చేనేతలకు సంక్షేమ పథకాలంటూ గొప్పలు చెప్పుకుంటోందని ఆ వర్గాల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మగ్గం అమ్మేశా : లక్ష్మీనారాయణ, చేనేత కార్మికుడు

చేనేత పనిలో గిట్టుబాటు కాకపోవడంతో మగ్గం, రాట్నం అమ్మేశా. విధిలేని పరిస్థితుల్లో వేరే పనిలోకి వెళుతున్నా. వేరే పనుల్లో వెళ్లాలంటే బాధగా ఉంది. పెయింటింగ్ షాప్‌లో పనిచేస్తున్నా. చేనేత పరిశ్రమను ప్రభుత్వం ఆదుకోవాలి.

రాయితీలు ఎత్తేశారు



తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చేనేతలకు ఆదరణ పథకం కింద యంత్ర పనిముట్లు ఇచ్చేవారు. ఈ ప్రభుత్వం రాయితీలన్నీ ఎత్తేసింది. సంక్షేమం అంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. నేతన్న నేస్తం రూ.24వేలతోనే సరిపెట్టారు. నేసిన చీరలకు గిట్టుబాటు కాక, కులవృత్తిని వదులుకుని షాపుల్లో పనిచేయడానికి వెళ్తున్నాం.

- నాగరాజు, చేనేత కార్మికుడు

భారంగా జీవనం : ప్రమీల, చేనేత కార్మికురాలు



కుటుంబమంతా పనిచేసినా సంపాదన అంతంతమాత్రంగానే వస్తోంది. నేసిన చీరకు కూడా 20 రోజుల తర్వాతే కూలి డబ్బులు ఇస్తారు. కంతులు, గ్రూప్ డబ్బులు కట్టుకోవాలన్నా ఇబ్బందికరంగా ఉంది. కుటుంబపోషణ భారంగా మారింది.

పూర్వ వైభవం తేవాలి



కుటుంబమంతా పనిచేసినా రోజుకు రూ.200 కూడా రావడం లేదు. చేనేతలకు పూర్వ వైభవం వచ్చేలా ప్రభుత్వాలు మార్పులు తీసుకురావాలి. ఉపాధి అవకాశాలు మెరుగుపరిచి చేనేత పరిశ్రమను ఆదుకోవాలి.

- రఘు, చేనేత కార్మికుడు

మూడేళ్లైనా మరమ్మతులేవీ..?

- పట్టించుకోని ప్రభుత్వం



మోపిడి వద్ద దెబ్బతిన్న లింక్ కెనాల్ రెగ్యులేటర్

ఉరవకొండ: మండలంలోని మోపిడి వద్ద పీఏబీఆర్ లింక్ కెనాల్ రెగ్యులేటర్ కూలిపోయి మూడేళ్లయినా వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. రెగ్యులేటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో మూడేళ్ల కిందట కూలిపోయింది. జిల్లాకు సాగు, తాగునీటికి వరప్రసాదిని అయిన ఈ కాలువపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. హెచ్చెల్సీ ఆధునికీకరణలో భాగంగా ఈ పనులు చేపట్టాల్సి ఉంది. ఆధునికీకరణ పనులు చేపట్టి పుష్కర కాలం దాటినా నేటికీ ముందుకు సాగలేదు. ఈ కాలువ ద్వారా 500 క్యూసెక్కులకు తరలించేందుకు కూడా ఇబ్బందికరంగా ఉంది. కాలువకు కూడా సిమెంట్ పెచ్చులూడిపోయి అధ్వానంగా ఉంది. లింక్ కాలువ ఆధునికీకరణ కలగా మారింది. మర్మతులకు రూ.60కోట్లతో అధికారులు మూడేళ్ల కిందట ప్రతిపాదించారు. నేటికీ నిధులు మంజూరు కాలేదు. హెడ్‌రెగ్యులేటర్ కూలిపోయి మూడేళ్లవుతున్నా దానికి మర్మతులు చేయకుండా వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతు సమస్యలను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందనడానికి ఇదొక నిదర్శనంగా మారింది.



చెల్లాచెదురుగా పడి ఉన్న షెట్టర్లు

బడుగుల కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశం

హిందూపురం లోక్‌సభ అభ్యర్థి బీకే పార్థసారథి

హిందూపురం, మే 5 : బడుగు, బలహీనవర్గాల కోసం ఆవిర్భవించిందే తెలుగుదేశం పార్టీ అని హిందూపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి బీకే పార్థసారథి అన్నారు. ఆదివారం హిందూపురంలోని జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వాల్మీకుల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు బలహీనవర్గాల కోసం ఎప్పుడూ పోరాటం చేస్తుందన్నారు. ముఖ్యంగా ఈ జిల్లాలో వాల్మీకులు, కురుబలకే తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసిందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా వాల్మీకులకు అవకాశం కల్పించింది టీడీపీనే అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా కూడా వాల్మీకులకు అవకాశం కల్పించిందన్నారు. భవిష్యత్తులో కూడా పార్టీ అండగా ఉంటుందన్నారు. హిందూపురం నియోజకవర్గంలో నందమూరి బాలకృష్ణ బీసీలకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి దోహదపడాలన్నారు. వాల్మీకుల సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తానని అన్నారు. దేశం, రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తోందని, వచ్చే ఐదేళ్లలో అంతా మంచే జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, అఘాయిత్యాలను దృష్టిలో పెట్టుకుని తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విలువైన రెండు ఓట్లను సైకిల్ గుర్తుకు వేసి మెజార్టీ వచ్చేలా కృషిచేయాలన్నారు. తెలుగుదేశం, టీడీపీ, జనసేన, రాష్ట్ర భవిష్యత్తు కోసం పోరాటం చేస్తున్నాయని, వీరికి రాష్ట్ర ప్రజలు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణ, వాల్మీకి సంఘం నాయకులు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి



బాలకృష్ణతో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

వైసీపీ పాలనలో కులవృత్తులకు మోసం

- నాయీ బ్రాహ్మణ సంఘం నాయకుడు కడదరకుంట నాగరాజు



తెలుగుదేశం పాలనలో కులవృత్తులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కులవృత్తులకు మోసం చేశారు. గత ఎన్నికల సమయంలో సీఎం జగన్ కుల వృత్తిదారులకు న్యాయం చేస్తానని చెప్పి, ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారు. టీడీపీ పాలనలో నాయీ బ్రాహ్మణులకు అవసరమైన పనిముట్లు అందించారు. పది మంది కలసి గ్రూపుగా ఏర్పడి సబ్సిడీ రుణాలు తీసుకున్నాం. బీసీ కార్పొరేషన్ కింద కులవృత్తులకు సబ్సిడీ పథకాలు వచ్చేవి. వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి జగన్ అన్ని పథకాలు ఎత్తివేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. కులవృత్తిదారులకు అండగా నిలబడతామని ప్రకటించిన చంద్రబాబునాయుడుకు మేము అండగా నిలబడుతాం.

- కూడేరు

మైనార్టీలపై కపట ప్రేమ

పేదపిల్లల పెళ్లిళ్లకు లక్ష ఇస్తానంటూ ఎగనామం

జగన్‌రెడ్డిపై మండిపడుతున్న ముస్లింలు



పుట్టపర్తి రూరల్: పేద ముస్లింల కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు దుల్హన్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇందులో పేదముస్లిం మహిళలకు పెళ్లి కానుకగా రూ.50వేలు పెళ్లి రోజున అందించేవారు. ప్రతిపక్షనేతగా ఉన్న జగన్‌రెడ్డి పేదముస్లిం మహిళలకు ఇచ్చే పెళ్లికానుక రూ. 50వేలు ఏమాత్రం సరిపోవని, తాను అధికారంలోకి వస్తే లక్షరూపాయలు అందిస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని ప్రతి ఎన్నికల సభలోనూ ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక ఆ పథకం వైపు ఆలోచన కూడా చేయలేదు. దీంతో పేద ముస్లింలు తమ పిల్లల పెళ్లిళ్లకు లక్ష రూపాయలు పెళ్లికానుక ఇస్తానని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చాక పథకాన్ని అటకెక్కించడంపై మండిపడుతున్నారు. పెళ్లికూతురు పదోతరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఈ రాష్ట్రానికి చెందిన అమ్మాయే అయి ఉండాలని.. ఇలా రకరకాల షరతులు విధించి పథకాన్ని అందకుండా చేశారని వాపోతున్నారు. కులం చూడం, మతం చూడం, మాటతప్పం.. మడమతిప్పం అంటూ ఎన్నికల ప్రసంగాల్లో దంచికొట్టిన జగన్‌కు తమకు మొండిచేయి చూపారని మైనార్టీ వర్గాలు మండిపడుతున్నాయి.

చంద్రబాబు ముస్లింలను ఆదుకున్నారు : షంషాద్ బేగం, కదిరి

మాలాంటి పేదలు ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయడానికి ఎంతో ఇబ్బందులు పడుతుండగా గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దుల్హన్ పథకాన్ని ప్రవేశ పెట్టి ఆదుకున్నారు. పేద ముస్లిం తల్లిదండ్రులకు దుల్హన్ పెళ్లికానుక ఎంతో భరోసానిచ్చేది. జగన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే లక్ష రూపాయలు ఇస్తానని నమ్మించి ఉన్న పథకాన్ని కూడా రద్దుచేశారు. ఈ ప్రభుత్వాన్ని రద్దుచేసే టైమొచ్చింది.

ఎన్నికల వాగ్దానం నెరవేర్చని జగన్ : రేష్మా, ధర్మవరం

దుల్హన్ పథకం కింద పేద ముస్లింలకు ఇస్తున్న పెళ్లి కానుకను తాను అధికారంలోకి వస్తే రూ.50వేల నుంచి లక్ష రూపాయలకు పెంచుతానని గత ఎన్నికల్లో జగన్‌రెడ్డి వాగ్దానం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అందిస్తున్న రూ.50వేలు పెళ్లికి ఏమాత్రం సరిపోదని చెప్పి మాతో ఓట్లు వేయించుకున్నారు. లక్షరూపాయలు ఇస్తానని చెప్పిన హామీని నిలబెట్టుకోలేకపోయారు.

వైసీపీలో పరిశీలకుల చిచ్చు..!

డబ్బు పంపిణీ కోసం కొత్త సారథులు

తమను సంప్రదించలేదని స్థానిక నాయకుల ఆగ్రహం



యల్లనూరు, మే 5: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ అధిష్టానం ఏర్పాటు చేసిన పరిశీలకులపై స్థానిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండురోజుల నుంచి అబ్జర్వర్లు గ్రామస్థాయి నాయకులను పక్కనబెట్టి గతంలో పనిచేసిన వలంటీర్ల ద్వారా ఓటర్ల స్లిప్పులను తయారు చేయిస్తున్నారు. గ్రామంలో తమ అధిపత్యాన్ని పక్కనబెట్టి ఇటీవల నియమించిన పరిశీలకులు వ్యవహరిస్తున్న తీరుపై గ్రామస్థాయి లీడర్లు మండల స్థాయి నాయకుల దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. యల్లనూరు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులను ఒక్కొక్కరిని నియమించారు. వీరి ద్వారా డబ్బులు పంపిణీ చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. వీరిచేత పంపిణీ జరిగితే గ్రామంలో తమ అధిపత్యం తగ్గుతుందని, రెండువర్గాలు ఉన్నచోట ఒక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని.. ఇలా అయితే తాము పార్టీకి ఓటు వేయాలని అడగలేమని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా వైసీపీలో పరిశీలకుల నియామకం చిచ్చురేపుతోంది.

ఇచ్చట ఓట్లు అమ్మబడవు..!



ప్రతి ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఓటర్లను కొనేందుకు ధన, వస్తు రూపేణా ప్రలోభ పెడుతుంటారు. హోరాహోరీ పోటీలో తాయిలాల ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం గుంతకల్లు నియోజకవర్గంలో పోటీ రసవత్తరంగా మారింది. గుత్తి పట్టణానికి చెందిన ఇస్మాయిల్ అనే పౌరుడు 'ఇచ్చట ఓట్లు అమ్మబడవు' అంటూ తన ఇంటికి స్టిక్కర్ వేశాడు. ఇది మండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రతి పౌరుడు తన ఓటును నిజాయితీగా.. నిఖార్సయిన నాయకుడికే వేసి నైతిక విలువలు కాపాడాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

\- గుత్తి రూరల్

తాగునీటి కోసం తంటాలు

ట్యాంకర్ వద్ద ఎగబడిన జనం

పాలకులపై పాతర్లపల్లి గ్రామస్థుల ఆగ్రహం

రొద్దం, మే 5 : ఎండలతో సతమతమవుతున్న జనం తాగునీటి కోసం తంటాలు పడాల్సి వస్తోంది. రొద్దం మండలం పాతర్లపల్లిలో శుద్ధజల కేంద్రం మూడేళ్ల క్రితం చెడిపోయింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వం మరమ్మతులు చేయించకపోవడంతో వృథాగా పడి ఉంది. దీంతో తాగునీటి కోసం జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా సర్పంచ్, అధికారులు పట్టించుకోలేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్. మరువపల్లిలోని మదర్‌వాటర్‌ప్లాంట్ నుంచి మూడు రోజులకోమారు శుద్ధజల నీరు పాతర్లపల్లికి ట్యాంకు ద్వారా సరఫరా చేస్తుంటారు. వారం రోజులైనా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మహిళలు వాపోయారు. ఆదివారం శుద్ధజల ట్యాంకు గ్రామంలోకి రాగానే మహిళలు చుట్టుముట్టి తోపులాడుకున్నారు. శుద్ధజల నీటి కేంద్రాన్ని కూడా మరమ్మతులు చేయించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని గ్రామస్థులు మండిపడ్డారు.



తాగునీటి కోసం ట్యాంకర్‌ను చుట్టుముట్టిన గ్రామస్థులు

అవినీతి ప్రభుత్వాన్ని దించేస్తాం..

రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

కేంద్ర హోంమంత్రి అమిత్ షా



పుట్టపర్తి, మే5 (ఆంధ్రజ్యోతి): అవినీతిలో కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని దించడానికే కూటమిగా ఏర్పడ్డామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. ధర్మవరంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం వికసిత్ ఆంధ్ర-వికసిత్ భారత్ ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో గూండాగిరీ సాగుతోందన్నారు. దానిని అంతం చేస్తామన్నారు. సీఎం జగన్ అవినీతిలో కూరుకుపోయి, అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అధికారం చేపట్టిన వెంటనే రాయలసీమలో పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబుతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. మళ్లీ కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారం చేపడితేనే అభివృద్ధి పరుగులు పెడుతుందని అమిత్ షా ఉద్ఘాటించారు.

నీరిస్తా.. పరిశ్రమలు తీసుకొస్తా..


అనంతను ఉద్యాన హబ్‌గా మారుస్తా

రైతును రాజు చేసే బాధ్యత తీసుకుంటా


యువతకు ఉపాధి కల్పిస్తా

ఇతర రాష్ట్రాలు జిల్లా వైపు చూసేలా చేస్తా

ధర్మవరం ప్రజాగళం సభలో చంద్రబాబు



పుట్టపర్తి, మే5 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలో ప్రతి ఎకరాకు నీరిస్తాననీ, పరిశ్రమలు తీసుకొస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. ధర్మవరంలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం వికసిత్ ఆంధ్ర-వికసిత్ భారత్ ఎన్నికల ప్రచార సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోపాటు చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో కూటమి గెలుపు ఖాయమైపోయిందన్నారు. దేశంలో నరేంద్రమోదీ ప్రధాని అవుతారన్నారు. పోలవరాన్ని పూర్తి చేయకుండా సీఎం జగన్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేయకుండా గోదావరిలో కలిపేశారన్నారు. రాయలసీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదనీ, ఒక్క పరిశ్రమ కూడా తేలేదనీ, ఏ ఒక్కరికీ ఉపాధి కల్పించలేదంటూ ధ్వజమెత్తారు. రాయలసీమ ద్రోహి జగన్ అంటూ మండిపడ్డారు. టీడీపీ హయాంలో హెచ్ఎన్ఎస్ఎస్ పూర్తి చేసి, గొల్లపల్లి రిజర్వాయర్‌ను నింపడంతోనే అంతర్జాతీయ కియ కార్ల పరిశ్రమ జిల్లాకు వచ్చి, ఏపీకే బ్రాండ్‌గా నిలిచిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో హెచ్ఎన్ఎస్ఎస్‌కు నిధులివ్వకపోగా.. ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా తీసుకురాలేకపోయారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పోలవరం పూర్తిచేసి, నదుల అనుసంధానం, హంద్రీనీవాను పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరిచ్చే తనదన్నారు. 90శాతం సబ్సిడీతో బిందుసేద్యం పరికరాలు అందించి, ఉమ్మడి జిల్లాను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్రం, రాష్ట్రం కలిపి ఏడాదికి రూ.25వేలకుపైగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రైతులకు అన్నివిధాలా సాయం చేసి, రారాజును చేసే బాధ్యత తీసుకుంటానన్నారు. జిల్లాకు పరిశ్రమలు తీసుకొచ్చి, యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. ఇతర రాష్ట్రాల వారు జిల్లా వైపు పరుగులు పెట్టేలా చేస్తానని హామీ ఇచ్చారు. చేనేత రంగాన్ని కాపాడేందుకు ప్రోత్సాహకాలిస్తానన్నారు. జీఎస్టీని వెనక్కిచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు, చేతి మగ్గాలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. చేనేతలకు ఏటా రూ.24వేలు అందజేస్తామన్నారు. టిడ్కో ఇళ్లు పూర్తిచేసి, లబ్ధిదారులకు ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. ధర్మవరంలో గుడ్‌మార్నింగ్ రెడ్డికి శాశ్వతంగా గుడ్‌నైట్ చెబుదామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గుర్రాల స్వారీ చేస్తూ, భూములన్నీ సర్వే చేసి, మరుసటిరోజు వాటిని కబ్జా చేస్తున్నాడని ఆరోపించారు. ఉప్పలపాడు రీచ్ నుంచి ఇసుకను బెంగళూరుకు తరలించి, రూ.కోట్లు దోచేశారనీ, ఇలాంటి ఎమ్మెల్యే అవసరమా అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.



సభలో అభివాదం చేస్తున్న అమిత్‌షా

సభలో అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న చంద్రబాబునాయుడు

షో

ధర్మవరం సభకు పోటెత్తిన జనం

అగ్రనేతల ప్రసంగాలతో ఉత్సాహం

వైసీపీ అరాచకాలపై ధ్వజమెత్తిన నేతలు

చప్పట్లు, కేరింతలతో జనం హర్షం

అగ్రనేతల పర్యటన సాగిందిలా..

ప్రజాగళం సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హాజరయ్యారు. అగ్రనేతలు ఇరువురు వేర్వేరుగా హెలీకాప్టర్లలో వచ్చారు. తొలుత అమిత్ షా పోతుకుంట వద్ద ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు రాగానే.. ఆయనకు బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సీఎన్‌బీ కల్యాణ మండం ఎదురుగా ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చంద్రబాబు చేరుకున్నారు. ఆయనకు టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు.

\- ధర్మవరం రూరల్



అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న చంద్రబాబు



సభలో అగ్రనాయకుల అభివాదం



చంద్రబాబు, అమిత్‌షా గుసగుసలు



జెండాల రెపరెపలు



చంటిబిడ్డతో...



సెల్‌లో బంధిస్తూ..

బండారు శ్రావణికి వడదెబ్బ



అనంతపురంలోని తన ఇంట్లో చికిత్స పొందుతున్న బండారు శ్రావణి

శింగనమల, మే 5: టీడీపీ కూటమి శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీకి వడదెబ్బ సోకింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె అనంతపురంలోని తన ఇంటి వద్దనే చికిత్స పొదుంతున్నారు. ఆమె శింగనమల మండలంలో ప్రచారం ముగించుకుని.. శనివారం రాత్రి 10 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఆ తరువాత కార్యకర్తలతో మాట్లాడి.. లిఫ్టులో పైకి వెళుతున్న సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. కుటుంబ సభ్యులు వెంటనే వైద్యులను పిలిపించి.. చికిత్స చేయించారు. ఈ కారణంగా ఆమె ఆదివారం ప్రచారానికి వెళ్లలేకపోయారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, మడకశిర మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆమెను పరామర్శించారు.

వైసీపీకి అధికారుల సలాం..!

టీడీపీకి నిరాకరించిన చోటే వైసీపీకి అనుమతి

అధికారుల పక్షపాత వైఖరిపై అభ్యర్థుల ఆగ్రహం

రాయదుర్గం, మే 5: ఎన్నికల అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వస్తున్నాయి. టీడీపీ పట్ల ఒక రకంగా, వైసీపీ పట్ల మరో విధంగా వ్యవహరిస్తున్నారు. రాయదుర్గం పట్టణంలో అనుమతులు లేకుండా వైసీపీ సభలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సభలు, సమావేశాలు నిర్వహించడానికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఆన్‌లైన్‌లోని సువిధ యాప్ ద్వారా పోటీ చేసే అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. కాగా ఆదివారం పట్టణంలోని ఆత్మకూరు వీధిలో పెద్ద ఎత్తున మహిళలు, మైనార్టీ వర్గాలతో వైసీపీ ఎన్నికల ప్రచార సమావేశాన్ని నిర్వహించింది. దీనిపై అనుమతుల గురించి ప్రశ్నిస్తే అధికారులు నోరు తెరుస్తున్నారు. ఈనెల 3న టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు మైనార్టీలతో ఆత్మకూరు వీధిలో ఆత్మీయ సమావేశానికి అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ స్థలంలో సమావేశాలు నిర్వహించకూడదని పోలీసు అధికారులు దరఖాస్తును తిరస్కరించారు. కానీ అదే స్థలంలో ఆదివారం సాయంత్రం మైనార్టీలతో వైసీపీ సమావేశం నిర్వహించింది. టీడీపీకి అనుమతి ఇవ్వని ప్రదేశంలో వైసీపీకి ఎలా ఇచ్చారని వివరణ కోరగా కొందరు పోలీసు అధికారులు అనుమతుతి ఇవ్వలేదని స్పష్టం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అనుమతులు ఇచ్చినట్లు చెబుతున్నారు. పోలీసు అధికారులు టీడీపీ పట్ల వివక్ష చూపుతున్నారని స్పష్టంగా తెలుస్తోంది. వైసీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడినా అధికారులు చోద్యం చూస్తున్నారనే చర్చ జోరుగా జరుగుతుంది. దీనిపై ఎన్నికల కమిషన్ విచారించి చర్యలు తీసుకోవాలని పోటీ చేస్తున్న అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.



వైసీపీ నిర్వహించిన సమావేశం

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయలేదు



పోస్టల్ బ్యాలెట్ వినియోగాన్ని ప్రారంభించి మూడురోజులైనా ఓటు నమోదు వివరాలను తెలిపే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయలేదు. కేవలం 30 నుంచి 40 శాతం మించి వినియోగం కాకపోవడం, ఫెసిలిటేషన్ సెంటర్లలో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. గెజిటెడ్ అధికారి సంతకంతో పాటు సీల్ స్టాంప్ వేయకుండా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఒక్కో ఓటు నమోదుకు 15 నిమిషాల సమయం తీసుకుంటుంది. ఓటు నమోదు శాతం తక్కువ కావాలనే కోరిక అధికారులలో కనిపిస్తోంది. ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో కలిగిన చైతన్యాన్ని భంగం కలిగించే రీతిలో నడుచుకోవడం భావ్యం కాదు. పోస్టల్ బ్యాలెట్ నమోదును 10వ తేదీ వరకు పొడిగించాల్సిన అవసరం ఉంది. ఓటింగ్ శాతం పెరగాలని కోరుకునే అధికారులు దానికి అనుగుణంగా సౌకర్యాలు కల్పించకపోవడం సరైన విధానం కాదు.

\- కెంచె లక్ష్మీనారాయణ, పెన్షనర్ల సమితి చైర్మన్, రాయదుర్గం

ఇద్దరు గెజిటెడ్ అధికారులను నియమించాలి

పరమేశ్వరప్ప, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు



పోస్టల్ బ్యాలెట్స్ వినియోగించుకోవడానికి ఉద్యోగులు తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితి నెలకొంది. గెజిటెడ్ అధికారులను నియమించడంలో నిర్లక్ష్యం వహించారు. దీంతో గంటలకొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. ప్రతిబూత్‌లో ఇద్దరు గెజిటెడ్ అధికారులను నియమించాలి. పైగా గెజిటెడ్ అటెస్టేషన్ చేసిన అధికారులు స్టాంప్, సీలు వేయకుండా ఓటు చెల్లకుండా చేస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసే విధానాలు మంచివి కావు. అదే విధంగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న వారి సంఖ్యను ఏరోజుకారోజు పత్రికా ప్రకటన ద్వారా తెలపాలి.

\- రాయదుర్గం

అమిత్‌షా, చంద్రబాబుకు ఘనస్వాగతం



కేంద్రమంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి, మే 5: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు జిల్లాకేంద్రంలోని సత్యసాయి విమానాశ్రయంలో ఆదివారం ఘన స్వాగతం లభించింది. ధర్మవరం పట్టణంలో చేపట్టిన ప్రజాగళం సభలో పాల్గొనేందుకు ఆయన విచ్చేశారు. ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి పుట్టపర్తికి చేరుకున్నారు. విమానాశ్రమంలో దిగగానే స్థానిక బీజేపీ నాయకులు కత్తి రాజారెడ్డి, కొండమరాజు, బాలగంగాధర్, సాకే రామాంజనేయులు, కల్యాణ్, నారాయణ, సునీల్ వైట్ల తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. తర్వాత అమిత్‌షా అక్కడినుంచి బయలుదేరి ధర్మవరం వెళ్లారు. సాయంత్రం ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో తిరిగి పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుని అక్కడినుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లారు.

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు సత్యసాయి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. ఆయన గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10:10 గంటలకు జిల్లాకేంద్రంలోని సత్యసాయి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, నాయకులు జెన్నచలపతి, రామాంజనేయులు, నరసింహులు తదితరులు పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో బయలుదేరి ధర్మవరం వెళ్లారు.

10లోపు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, మే 5: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి నిర్వహించే ఆర్డీటీ సెట్ ప్రవేశ పరీక్షకు ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కులంతో సంబంధం లేకుండా ఆర్డీటీ సెట్ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆర్డీటీలో స్పాన్సర్ నెండర్ కలిగి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదివినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 500పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసుల్లో పదోతరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీ) మూడు పాస్ ఫొటోలతో దరఖాస్తు అందజేయాలన్నారు. మే 19న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, వివరాలకు 08554-271353, 271354లను సంప్రదించాలని సూచించారు.

వీర విధేయుడి బదిలీ

అనంతపురం క్రైం, మే 5: వైసీపీ వీరవిధేయుడిగా గుర్తింపు పొందిన అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డిపై బదిలీ వేటు పడింది. కిందిస్థాయి అధికారికి తక్షణమే బాధ్యతలు అప్పగించి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ మండలం రామక్రిష్ణ కాలనీలో వైసీపీ ఎంపీటీసీ భర్త నగేష్‌పై జరిగిన దాడి ఘటనలో సంబంధం లేనివారిని కేసులో ఇరికించారని డీఎస్పీపై ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జయరాంనాయుడు, ఆయన భార్య హరిత తదితరులను కేసులో చేర్చారు. ఓటర్లను భయపెట్టి, ప్రలోభాలకు పాల్పడేందుకు వైసీపీ వారు ఈ ఎత్తుగడ వేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై టీడీపీ, సీపీఐ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచనలు, ఆదేశాల మేరకే డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఇలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం స్పందించిన ఎన్నికల కమిషన్.. డీఎస్పీపై వేటు వేసింది.

ముస్లిం శ్మశానవాటికలో అగ్నిప్రమాదం

● రూ.రెండు లక్షలు నష్టం



ముస్లిం శ్మశానవాటికలో దగ్ధమైన చెట్లు

ఓబుళదేవరచెరువు, మే 5: మండలంకేంద్రంలోని ముస్లిం శ్మశానవాటికలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పచ్చని చెట్లు, డ్రిప్ పైపులు, నీటి సరఫరా పైపులు దగ్ధమయ్యాయి. శ్మశానవాటిక పర్యవేక్షకులు అబ్దుహాస్సేన్, బాబా తెలిపిన వివరాల మేరకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని, దీంతో మంటలు పెద్దఎత్తున చెలరేగడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. నాలుగేళ్ల అల్లనేరేడు, కొబ్బరి చెట్లు 60దాకా కాలిపోయాయన్నారు. అలాగే డ్రిప్, నీటి సరఫరా పైపులు దగ్ధమైనట్లు చెప్పారు. యువకులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రమాదంలో రూ. రెండు లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు.

వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి రాజీనామా

ఓబుళదేవరచెరువు, మే 5: వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టివారి రమేష్‌కుమార్ ఆ పార్టీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేసినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామా పత్రాన్ని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి పంపినట్లు పేర్కొన్నారు. త్వరలో టీడీపీలో చేరనున్నట్లు ఆయన తెలిపారు.

ఫొటో, వీడియోగ్రాఫర్ల కమిటీ ఏర్పాటు

ముదిగుబ్బ, మే5: మండల కేంద్రంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా జీటీ జయశంకర్, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, కార్యదర్శిగా రాజ కుళ్లాయప్ప, జాయింట్ సెక్రెటరీగా మధు, ట్రెజరర్‌గా ప్రిన్స్ బాబు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. ఇక కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, నూరి, నూరు, చిన్నప్ప, అజహర్ తదితరులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్, మే 5: అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి ఆంధ్రలో విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 1506 (90 ఎంఎల్) కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు కణేకల్లు సెబ్ సీఐ కిషోర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఎరుకుల నాగరాజు, గంగవరం బాబావలి, కర్ణాటకకు చెందిన మహమ్మద్ షబ్బీర్‌ల నుంచి మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూను సందర్శించిన రక్షణశాఖ సలహాదారు సతీష్ రెడ్డి

అనంతపురం సెంట్రల్, మే 5: రక్షణ శాఖ సలహాదారు సతీష్‌రెడ్డి ఆదివారం సాయంత్రం జేఎన్‌టీయూను సందర్శించారు. ఒక ప్రైవేట్ కార్యక్రమానికి నగరానికి వచ్చిన ఆయన.. జేఎన్‌టీయూని సందర్శించి అధికారులతో మాట్లాడారు. వీసీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థి సతీష్‌రెడ్డి వర్సిటీకి రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు విజయకుమార్, సత్యనారాయణ, అరుణకాంతి, కిరణ్మయి, విశాలి, చిత్ర, కళ్యాణిరాధ, భారతి, రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: కందికుంట

గాండ్లపెంట, మే 5: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. గాండ్లపెంట పంచాయతీ ఎల్లుగుట్టివారిపల్లి, జీన్లకుంట, పోతువాండ్లపల్లి, నాయనవారిపల్లి, కొట్లపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆయా గ్రామస్థులు, స్థానిక నాయకులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం ఆయన ఇంటింటా తిరుగుతూ ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. అంతేకాకుండా రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు. కనుక ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి నన్ను ఎమ్మెల్యేగా, బీకే పార్థసారధిని ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య, సింగల్‌విండో మా జీ అధ్యక్షుడు వెంకటరమణా రెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కూ టమి శ్రేణులు పాల్గొన్నారు. కందకుంట ప్రచారానికి న్యాయవాదుల సంఘం సభ్యులు హర్షవర్ధన్, ప్రభాకర్‌రెడ్డి, రామలింగారెడ్డి తదితరులు మద్దతు పలికారు.

● గాండ్లపెంట మండలకేంద్రంలోని కదిరి, రాయచోటి రహదారిపై కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. గంగమ్మవీధినుంచి ప్రారంభమైన ర్యాలీ ఎల్లుగుట్టివారిపల్లి వరకు సాగింది. శ్రేణులు ఆద్యంతం కూటమికి, కందికుంటకు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువ నాయకులు అక్రమ్‌బాషా, దాదాపీర్, పవన్, యూనస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

గాండ్లపెంట: మండల వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ బునగారి సూర్యశేఖరరెడ్డి, నాయకుడు ప్రసాద్ టీడీపీలోకి చేరారు. ఎల్లుగుట్టివారిపల్లిలో ఎన్నికల ప్రచారంలో ఉన్న కందికుంట వెంకటప్రసాద్ ను వారు కలిసి పార్టీలోకి చేరారు. వారికి కుందికుంట కండువాలు వేసి ఆహ్వానించారు.

కదిరిఅర్బన్: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. పట్టణంలోని కందికుంట నివాసంలో ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. కందికుంట కండువాలు వేసి ఆహ్వానించారు. చేరిరినవారి లో జెన్నప్ప, రవినాయుడు, ఉత్తమరెడ్డి, మహేంద్ర, నాగరాజు తదితరులు ఉన్నారు.

21వార్డులో యశోదమ్మ ప్రచారం

కదిరిఅర్బన్: కదిరి పట్టణంలోని 21వవార్డులో కందికుంట వెంకట ప్రసాద్ సతీమణి కందికంట యశోదమ్మ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంటను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని, ఆ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● పట్టణంలోని 24వ వార్డులో కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి అధికారంలోకి రాగానే అమలు చేసే సంక్షేమపథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్‌గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.



ఎల్లుగుట్టివారిపల్లిలో ప్రచారం చేస్తున్న కందికుంట



21వ వార్డులో ప్రచారం చేస్తున్న కందికుంట యశోదమ్మ

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం: పల్లె సింధూర



సున్నంపల్లిలో ఓటును అభ్యర్థిస్తున్న పల్లె సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, మే 5: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సున్నంపల్లి పంచాయతీ సున్నంపల్లి, మకలవారిపల్లి, పెద్దగుట్లపల్లి, రామయ్యపేట, చౌడేపల్లి, మహమ్మదా బాద్ క్రాస్ గ్రామాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. గ్రామస్థులు, స్థానిక నాయకులు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. అనంతరం ఆమె ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా 193 చెరువులను నీటితో నింపుతామని హామీ ఇచ్చారు. అలాగే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించి చంద్ర బాబు సీఎం అవగానే అమలు చేస్తారని చెప్పారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని కూడా భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైసీపీ పాలన అంతా అవినీతి మయంగా సాగిందన్నారు. ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ జయచంద్ర, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పిట్టా ఓబులరెడ్డి, సర్పంచ్ దారా లక్ష్మీదేవమ్మ, నాయకులు దారా నాగేంద్ర, బోనాల రామాంజి, బ్రహ్మానందరెడ్డి, బైరిశెట్టి, నంది నరసింహులు, రాజారెడ్డి, వైదేహి, మస్తానమ్మ, జ్యోతి, భాగ్యమ్మ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: మండలంలోని బొంతలపల్లిలో పల్లె సింధూర ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షో చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయమన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజల బాగోగులను ఏనాడూ పట్టించుకోలేదన్నారు. ఆయన్ను ఈ ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం అనంతరం బొంతలపల్లిలో గంగయ్య, ఓబులేసు, ఓబులేసు, బాషా, అంజి, రమణమ్మతో పాటు ఆరు కుటుంబాల వారు వైసీపీని వీడి పల్లె సింధూర సమక్షంలో టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో సర్పంచు శ్రీనివాసులు, కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు శ్రీరామిరెడ్డి, ఆదినారాయణరెడ్డి, చిన్నకృష్ణ, పుల్లప్ప, సాంబశివ, వెంకటేసు గంగయ్య, వెంకటస్వామి, కుళ్ళాయప్ప, రాంబూపతి, నాగేష్, కూటమి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

నేడు పల్లె వెంకటకృష్ణకిశోర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

నల్లమాడ: మండలకేంద్రంలో టీడీపీ యువనాయకుడు పల్లె వెంకటకృష్ణ కిశోర్‌రెడ్డి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ ఆదివారం తెలిపారు. పల్లె కిశోర్ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.



బొంతలపల్లిలో రోడ్‌షో..

కార్యాలయాలు ఖాళీ..!

● పనులు జరగక ఇబ్బంది పడుతున్న ప్రజలు



తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు

కొత్తచెరువు, మే 5: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులకు మండలంలోని రెవెన్యూ సిబ్బందిని జిల్లా అధికారులు కేటాయించారు. దీంతో మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ప్రజలు, విద్యార్థులు వివిధ పనులపై కార్యాలయానికి వస్తున్నారు. అక్కడ అధికారులు ఎవరూ లేకపోవడంతో తిరుగుముఖం మడుతున్నారు. ఈ తంతు గత మూడు రోజులు నుంచి జరుగుతోంది. టెన్త్, ఇంటర్ పరీక్షల ఫలితాలు రావడంతో విద్యార్థులు కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. వాటిని మంజూరు చేయాల్సిన అధికారులు ఎన్నికల నిర్వహణకు వెళ్లడంతో మా పరిస్థితి ఏమిటని మదనపడుతున్నారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న కంప్యూటర్‌లను సైతం రెండురోజుల క్రితం ఎన్నికల విధులకు పుట్టపర్తికి తరలించినట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు మే 5: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, అలంకరణ, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, మహామంగళహారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి అక్కిరెడ్డి, ప్రధాన అర్చకుడు రాముస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

అలరించిన రంగప్రవేశం

అనంతపురం కల్చరల్: శ్రీ నృత్యకళా నిల యం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శారదా నగర్ లోని శృంగేరి శంకర మఠంలో నిర్వహిం చిన రంగప్రవేశం వీక్షకులను అలరించింది. ఈ సందర్భంగా చిన్నారులు అక్షయ, ప్రణవి, హశ్విహ మహాలక్ష్మి, ప్రణవి, కీర్తి వైష్ణవి, సుహీ న, పూర్ణిత, నిహస్వి, నిక్షిప్త, భూమిక, అద్వైత, లాస్యశ్రీ, ఉపాస్యశ్రీ, పద్విక, రూప, వర్షిక, విది త, శాన్వి, మేఘన, రుహికలు శాస్త్రీయ సంగీ తానికి సంప్రదాయ భరత నాట్యంతో అలరించారు. నాట్యాచార్యురాలు పాల్గొన్నారు.



నృత్యాభినయంతో అలరిస్తున్న చిన్నారులు

సూపర్ సిక్స్ పథకాలపై ముమ్మర ప్రచారం

నల్లమాడ, మే 5: మండలకేంద్రంలోని మేదర వీధిలో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు సూపర్ సిక్స్‌పథకాలపై ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా ఇంటింటికీ తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ ఆ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వీటి వల్ల కుటుంబంలో ఎవరెవరికి ఏమేరకు లబ్ధి చేకూరుతుందో తెలియజేశారు. మహిళలకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రతికుటుంబానికి ఉచితంగా మూడు సిలిండర్లు, తల్లికివందనం పేరుతో చదువుకునే పిల్లలకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు, ప్రతి మహిళలకు నెలకు రూ.15వందలు, నిరుద్యోగులకు ఉపాధి, భృతి, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితర ఉపయోగాలు ఉన్నట్లు చెప్పారు. చంద్రబాబు సీఎం అవగానే వీటిని అమలు చేస్తారని చెప్పారు. ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేగా పల్లె సింధూరను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, మంజునాథ్‌రెడ్డి, బాబావలి కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లు: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు దేశాయి విదుర శేఖర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి వాటి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే వాటిని అమలు చేస్తారన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కందికుంట వెంకటప్రసాదేను, ఎంపీగా బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, నాయకులు శంకర్‌నాయుడు, రాజారెడ్డి, గోవిందు, మహబూబ్‌బాషా కార్యకర్తలు పాల్గొన్నారు. గిరిజన మండల నాయకులు శ్రీరాములనాయక్, ఉత్తన్ననాయక్, బాలాజీనాయక్, శంకర్ నాయక్, జయకుమార్‌నాయక్, ప్రభాకర్‌నాయక్, నాగభూషణంనాయక్ మండలంలోని తండాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



నల్లమాడ మేదరవీధిలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో అయ్యప్ప మూలవిరాట్

ఓబుళదేవరచెరువు, మే 5: మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌ను పాలు, పెరుగు, తేనే, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకరించారు. తర్వాత విశేష అలంకరణలు, పూజలు చేశారు. ఆలయంలోని విగ్రహ ప్రతిష్ఠ 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పూజల్ని నిర్వహించినట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శించి తీర్థ ప్రసాదాలు పొందారు.

నిరుపయోగంగా చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు

● నిర్వహణ సరిగా లేకనే ఈ దుస్థితి



బూరుగుపల్లిలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద కేంద్రం

కదిరిఅర్బన్, మే 5: స్వచ్ఛగ్రామాలే లక్ష్యంగా కదిరి మండలంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో తడి, పొడి చెత్తను ఆయా కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువులను తయారు చేసి, తద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వాటిని ఏర్పాటు చేసింది. కొద్దిరోజులకే అవి నిర్వహణ సరిగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వీటికోసం రూ.లక్షలు వెచ్చించినా, లక్ష్యం నేరవేరలేదని, దీంతో ప్రజాధనం వృథా అయిందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అవినీతి ప్రభుత్వానికి అంతం పలకండి

పుట్టపర్తి మే 5: అవినీతి ప్ర భుత్వానికి ఓటు ద్వారా అంతం పలకాలంటూ సినీనటుడు, హిం దూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచించినట్లు ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు కొత్తపల్లి జయప్రకాష్ తెలిపారు. పుట్టపర్తి ఎయిర్‌పోర్టులో ఆదివా రం బాలయ్యను కలిసి శాలువాతో సన్మానించామన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ పుట్టప ర్తి నియోజకవర్గంలో పల్లె సిం ధూరను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని , అవినీతి ప్రభుత్వానికి అంతం పలకాలని సూ చించినట్లు ఆయన చెప్పారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గుత్తి రూరల్, మే 5: మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు (60) అనే రైతు అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు దొడ్డి వామి వద్దకు వెళ్లి చూశారు. అప్పటికే వామి వద్ద చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... రామాంజనేయులుకు 3 ఎకరాల పొలం ఉందని, మరో 9 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడన్నారు. కొన్నేళ్లుగా వేరుశనగ, ఆముదం పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయాడన్నారు. ఈ ఎడాది వేరుశనగ పంట సాగు చేయగా, దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మదనపడేవాడన్నారు. రూ.8లక్షల వరకు అప్పు చేసినట్లు తెలిపారు. అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



రామాంజనేయులు (ఫైల్)

టీడీపీ ప్రచారకర్తపై వైసీపీ నాయకుడి దాడి

గుంతకల్లు, మే 5: వార్డులో టీడీపీ ప్రచార రథాన్ని పెట్టినందుకు అక్కసుతో వైసీపీ నాయకుడు రమేశ్ నాయుడు తనపై దాడిచేసి, చొక్కా చించి కొట్టాడంటూ టీడీపీ కార్యకర్త సునీల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాంకు చెందిన ఎల్ఈడీ ప్రచార రథాన్ని దాని డ్రైవరు సునీల్ దోనిముక్కల రోడ్డు ఏరియాలో ఉంచాడు. తన ఇంటికి సమీపంలో, తన వార్డులో ప్రచారం పెడతావా.. అంటూ 6వ వార్డు కౌన్సిలరు చెన్నమ్మ కుమారుడు రమేశ్ నాయుడు తనపై దాడిచేసి కొట్టాడని సునీల్ స్థానిక రూరల్ పీఎస్‌లో ఫిర్యాదుచేశాడు. తాను దళితుడినని దాడి చేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు ను నమోదు చేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వాల్మీకులను గుర్తించింది టీడీపీనే...

ఆత్మీయ సమావేశంలో నందమూరి బాలకృష్ణ



వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బాలకృష్ణ

హిందూపురం, మే 5: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వాల్మీకులను గుర్తించి పదవులు ఇచ్చింది తెలుగుదేశం పార్టీయేనని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. పురంలోని జేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం వాల్మీకుల ఆత్మీయ సమావేశం జరిగింది. నియోజకవర్గంలోని వేలమంది వాల్మీకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... వాల్మీకి సామాజిక వర్గానికి పార్టీ పదవుల్లో సింహభాగం కేటాయించామన్నారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో ఎంపీతోపాటు రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించామన్నారు. గతంలోనూ నియోజకవర్గంలో స్థానిక సంస్థల్లో వాల్మీకులకే అధికంగా ఇచ్చామని గుర్తుచేశారు. వాల్మీకులు అత్యధికంగా టీడీపీవైపు ఉన్నారని, వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో బీసీలపై దాడులు పెరిగాయన్నారు. బీసీల కోసం ప్రత్యేక చట్టం తెస్తున్నామని, అది వారికి కవచంలా పనిచేస్తుందన్నారు. ఎప్పుడూ టీడీపీకి పట్టుకొమ్మల్లా నిలుస్తున్న బీసీలకు ఏమిచ్చినా పార్టీకి వారి రుణం తీర్చు కోలేనిదన్నారు. ఈ ఎన్నికల్లో బీసీలంతా టీడీపీకి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా వాల్మీకి కులసంఘం, టీడీపీ నాయకులు బాలకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు కొల్ల కుంట అంజినప్ప, వాల్మీకి కుల సంఘం నాయకులు ఆదినారాయణప్ప, డీఈ రమేష్, బేవనహళ్లి ఆనంద, శివశంకర్, వైటీపీ శ్రీనివాస్, వైటీపీ వెంకటరమణ, మంజునాథ్, బిందు, ఆదినారాయణ, శిరి వరం కిష్టప్ప, రామక్రిష్ణ, రాజశేఖర్, సురేష్, సాకే ఆంజనేయులు, సితార శ్రీనివాసులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షికి మరింత గుర్తింపు తెస్తాం : వసుంధరాదేవి

లేపాక్షి : మూడోసారి ఎన్నికల బరిలో ఉన్న నందమూరి బాలకృష్ణను గెలిపిస్తే లేపాక్షికి మరింత గుర్తింపు తెస్తామని నందమూరి వసుంధరాదేవి పేర్కొన్నారు. ఆమె ఆదివారం మండలంలోని పులమతి పంచాయతీలోని తిలక్‌నగర్, శిరివరం పంచాయతీ పరిధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వసుంధరాదేవి సోదరుడు ప్రసాద్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ రావెళ్ల లక్ష్మి, సుమిత్ర, మండల కన్వీనర్ జయప్ప, నాయకుడు మారుతిప్రసాద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో వసుంధరాదేవి విజయ సంకేతం

టీడీపీలోకి పలువురి చేరిక

చిలమత్తూరు: మండలంలోని కందురిపర్తికి చెందిన 20కుటుంబాలు ఆదివారం టీడీపీలో చేరాయి. వారికి స్థానిక కొడికొండ చెక్‌పోస్టు వద్ద వసుంధరాదేవి సోదరుడు ప్రసాద్ టీడీపీ కండువాలు వేసి ఆహ్వానించారు.

ఇంటింటి ప్రచారానికి ఈసీ అనుమతులు అక్కర్లేదు: ఎంపీడీఓ

రొద్దం, మే 5 : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏ పార్టీ అభ్యర్థులైనా ఇంటింటి ప్రచారం కోసం ఈసీ అనుమతులు ఇక నుంచి అవసరం లేదని ఆదేశాలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కేశవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకపటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు ప్రతి గ్రామంలోనూ ఆయా పార్టీల అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకోవాల్సి ఉండేదన్నారు. ఇక నుంచి ఈసీ అనుమతులు లేకుండానే గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేసుకోవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తెలిపారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీ



కోగిరలో ఓటరు స్లిప్పులను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రొద్దం, మే 5: రాష్ట్రంలో ఈనెల 13వ తేదీన జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటువేసేందుకు గ్రామ సచివాలయ పరిధిలోని అధికారులు ఓటరుస్లిప్పులు పంపిణీచేశారు. రొద్దం మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివారం పంపిణీ చేశారు. రొద్దం మండల వ్యాప్తంగా 48 పోలింగ్ బూత్‌లుండగా ఎంపీ, ఎమ్మెల్యే ఓటు వేసేందుకు అనువుగా ఈసీ ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులను అందజేసినట్లు అధికారులు తెలిపారు.

బీఎల్‌ఓల ద్వారా స్లిప్పుల పంపిణీ

తహసీల్దార్ వెకంటేశ్వర్లు

అగళి, మే 5 : రాష్ట్రంలో ఈనెల 13న జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు, మండల వ్యాప్తంగా ఓటరు స్లిప్పులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు 36వేల ఓటర్లు ఉన్నారని 29మంది బీఎల్‌ఓలు, వీఆర్‌ఓల చేత ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తామన్నారు. రెండు మూడు రోజుల్లో ఓటర్ల స్లిప్పుల పంపిణీ కార్యక్రమం ముగియనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

టీడీపీలోకి ఎమ్మెల్యే సోదరుడి కుమారుడి చేరిక



టీడీపీలో చేరిన శివకుమార్ తదితరులు

మడకశిరటౌన్, మే 5: వైసీపీ స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి తమ్ముడి కుమారుడు శివకుమార్ తన అనుచరులతో ఆదివారం టీడీపీలో చేరారు. అలాగే మడకశిర పట్టణం, మండలం, గుడిబండ మండలం కల్లురొప్పం గ్రామానికి చెందిన పలువరు వైసీపీ నాయకులు, కల్లుమర్రి పంచాయతీకి చెందిన కాంగ్రెస్ నాయకులు టీడీపీలో చేరారు. స్థానిక బాలాజీ నగర్‌లో ఉన్న టీడీపీ కార్యాలయంలో వారికి ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

ముస్లిం శ్మశానవాటికలో అగ్నిప్రమాదం

● రూ.రెండు లక్షల నష్టం



ముస్లిం శ్మశానవాటికలో కాలిపోయిన చెట్లు

ఓబుళదేవరచెరువు, మే 5: మండలంకేంద్రంలోని ముస్లిం శ్మశానవాటికలో ఆదివారం అగ్నిప్రమాద జరిగింది. ఈప్రమాదంలోపచ్చని చెట్లు, డ్రిప్ పైపులు, నీటి సరపరా పైపులు కాలిపోయాయి. దీంతో రూ. రెండులక్షలు నష్టం జరిగింది. శ్మశానవాటిక పర్యవేక్షలు అబ్బుహుస్సేన్, బాబా తెలిపిన వివరాల మేరకు ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి పెడడంతో ప్రమాదంలో నాలుగేళ్ల అల్లనేరేడు, టెంకాయ చెట్లు 60దాకా కాలిపోయాయి. అలాగే డ్రిప్, నీటి సరపరా పైపులు కాలిపోయినట్లు చెప్పారు. యువకులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితంలేదన్నారు.

టీడీపీ ప్రచారకర్తపై వైసీపీ నాయకుడి దాడి

గుంతకల్లు, మే 5: వార్డులో టీడీపీ ప్రచార రథాన్ని పెట్టినందుకు అక్కసుతో వైసీపీ నాయకుడు రమేశ్ నాయుడు తనపై దాడిచేసి, చొక్కా చించి కొట్టాడంటూ టీడీపీ కార్యకర్త సునీల్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాంకు చెందిన ఎల్ఈడీ ప్రచారథాన్ని దాని డ్రైవరు సునీల్ దోనిముక్కల రోడ్డు ఏరియాలో ఉంచాడు. తన ఇంటికి సమీపంలో, తన వార్డులో ప్రచారం పెడతావా.. అంటూ 6వ వార్డు కౌన్సిలరు చెన్నమ్మ కుమారుడు రమేశ్ నాయుడు తనపై దాడి చేసి కొట్టాడని సునీల్ స్థానిక రూరల్ పీఎస్‌లో ఫిర్యాదుచేశాడు. తాను దళితుడినని దాడిచేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసును నమోదు చేయాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నాడు.ల

చికిత్స పొందుతూ రైల్వే ఉద్యోగి మృతి

గుత్తి, మే 5: ఆత్మహత్యకు పాల్పడి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రమేష్ అనే రైల్వే ఉద్యోగి ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక రైల్వేలో టీటీఈగా వి ధులు నిర్వహిస్తున్న రమేష్ ఆర్థిక పరిస్థితులు, కు టుంబ సమస్యలతో, మానసిక వేదనకు గురై ఇంట్లో శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ఎన్నికల ప్రచారంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న సవిత



ప్రజల వద్దకు వెళ్లి ఓటును అభ్యర్థిస్తున్న దృశ్యం

గోరంట్ల, మే 5: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత తెలిపారు. మండలంలోని కొండాపురం, వెంకటరమణపల్లి, పులేరు పంచాయతీల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో పోటీ పడుతూ వివిధ రకాల పండ్లతో, పూలతో తయారు చేసిన గజమాలలు వేసి, హారుతులలో స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ... టీడీపీ మేనిఫెస్టో పట్ల సంతృప్తి చెందిన ప్రజలు చూపిస్తున్న ఆదారాభిమానంతో ఇది ఎన్నికల ప్రచారంలా లేదని విజయోత్సవంలా ఉందన్నారు. బలహీనవర్గాల అభ్యున్నతికోసమే ఎన్టీఆర్ ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భవించిందిన్నారు. లబ్ధిదారులకు పించన్లను ఇళ్ల వద్ద చెల్లించలేక బ్యాంక్‌లు, పోస్టాఫీసుల చుట్టూ తిప్పుతూ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందన్నారు. అయితే ఇందుకు టీడీపీపై బురదచల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. పింఛన్లు ప్రారంభించింది టీడీపీనే అని, రూ. 200నుంచి రూ. రెండువేలకు పెంచిన ఘనత చంద్రబాబుదన్నారు. మళ్లీ రూ.నాలుగువేలు చేస్తామని ఆయన ప్రకటించారని, వాస్తవాలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఉచితాల పేరుతో బటన్ నొక్కి ఇస్తున్నామంటున్న సీఎం జగన్ ధరల పెరుగుదల, పన్నులు తదితర రూపాల్లో ప్రజల నుంచి రెట్టింపు మొత్తంలో దోచుకుంటున్నారన్నారు. జగన్‌కోసం తీహార్ జైలు తలుపులు తెరుచుకున్నాయని, ఊచలు లెక్కపెట్టడానికి ఆయన సిద్ధం కావాలన్నారు. తాగు, సాగు నీరు, ఉపాధి తదితర అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. కావున సైకిల్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పార్థసారథిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మండలంలోని జక్క సముద్రం, చలమయ్యగారిపల్లి, ముద్దలకుంటపల్లి, గాజులవాండ్లపల్లి, వానవోలు, రొద్దం మండలంలోని గొబ్బరంపల్లికి చెందిన వారు 35కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సోముశేఖర్, నిమ్మల యువ శేఖర్, నిమ్మల శిరీష్, అశ్వర్థరెడ్డి, బెల్లాలచెరువు చంద్ర, వెంకటరంగారెడ్డి, గోవిందరెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుబ్ర హ్మణ్యం, హంపయ్య, శ్రీనివాసులు, నిమ్మల శ్రీదర్, వెంకటరాముడు, నరేష, కిషోర్‌రాయల్, మరెడ్డిపల్లి నరసింహులు, కూటమి నాయకులు, కార్యకర్తలున్నారు.



టీడీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న సవిత

హామీలు విస్మరించిన జగన్

ఓటుతో బుద్ధి చెప్పండి: ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, మే 5: ముఖ్యమంత్రి జగన్ మడకశిరకు వచ్చినప్పుడు వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేరుస్తామని హామీ ఇచ్చి, అనంతరం దానిని విస్మరించారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజు విమర్శించారు. హామీలు ఇచ్చి విస్మరించే జగన్‌కు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో వాల్మీకుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గం సమన్వయకర్త గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎంఎస్ రాజు పాల్గొని మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. టీడీపీకి బీసీలే వెన్నుముక అని, వారి అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమన్నారు. బీసీలు టీడీపీని ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాధమ్మ, నాయకులు ఓబుళేశు, మాధవరాజు, మనోహర్‌తో పాటు నియోజకవర్గంలోని అనేక మంది వాల్మీకులు పాల్గొన్నారు.

అన్నపై తమ్ముడి దాడి

ఉరవకొండ, మే 5: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఆస్తి వివాదం నేపథ్యంలో అన్న రామకృష్ణ, అతని కుమారులపై తమ్ముడు వెంకటనారాయణ ఆదివారం దాడికి పాల్పడ్డాడు. రామకృష్ణ తోటలో పనులు చేసుకుంటుండగా వెంకటనారాయణ, అతని కుమారులు కర్రలతో దాడి చేశారు. దాడిలో రామకృష్ణ, అతని కుమారులు లోకేష్, ధనంజయకు గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రామకృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి తీసుకెళ్లారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

10లోపు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, మే 5: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి నిర్వహించే ఆర్డీటీ సెట్ ప్రవేశ పరీక్షకు ఈనెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మోహన్‌మురళీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు కులంతో సంబంధం లేకుండా ఆర్డీటీ సెట్ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆర్డీటీలో స్పాన్సర్ నెండర్ కలిగి విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చదివినా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 500పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఉమ్మడి జిల్లాలో ఉన్న ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీసుల్లో పదోతరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీ) మూడు పాస్ ఫొటోలతో దరఖాస్తు అందజేయాలన్నారు. మే 19న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు 08554-271353, 271354లను సంప్రదించాలని సూచించారు.

వీర విధేయుడి బదిలీ

అనంతపురం క్రైం, మే 5:
వైసీపీ వీరవిధేయుడిగా గుర్తింపు పొందిన అనంతపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డిపై బదిలీ వేటు పడింది. కిందిస్థాయి అధికారికి తక్షణమే బాధ్యతలు అప్పగించి, పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రూరల్ మండలం రామక్రిష్ణ కాలనీలో వైసీపీ ఎంపీటీసీ భర్త నగేష్‌పై జరిగిన దాడి ఘటనలో సంబంధం లేనివారిని కేసులో ఇరికించారని డీఎస్పీపై ఆరోపణలు వచ్చాయి. ఇటీవలే వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జయరాంనాయుడు, ఆయన భార్య హరిత తదితరులను కేసులో చేర్చారు. ఓటర్లను భయపెట్టి, ప్రలోభాలకు పాల్పడేందుకు వైసీపీ వారు ఈ ఎత్తుగడ వేశారనే ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై టీడీపీ, సీపీఐ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సూచనలు, ఆదేశాల మేరకే డీఎస్పీ వీరరాఘవరెడ్డి ఇలా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం స్పందించిన ఎన్నికల కమిషన్.. డీఎస్పీపై వేటు వేసింది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

గుత్తిరూరల్, మే 5:
మండలంలోని శ్రీపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు (60) అనే రైతు అప్పుల బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు దొడ్డి వామి వద్దకు వెళ్లి చూశారు. అప్పటికే వామి వద్ద చెట్టుకు వేలాడుతూ కనిపించాడు. పోలీసులు, బంధువులు తెలిపిన మేరకు... రామాంజనేయులుకు 3 ఎకరాల పొలం ఉందని, మరో 9 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడన్నారు. కొన్నేళ్లుగా వేరుశనగ, ఆముదం పంటలు సాగుచేసి తీవ్రంగా నష్టపోయాడన్నారు. ఈ ఎడాది వేరుశనగ పంట సాగు చేయగా, దిగుబడి ఆశించిన స్థాయిలో రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలని మదనపడేవాడన్నారు. రూ.5లక్షల వరకు అప్పు చేసినట్లు తెలిపారు. అప్పు తీర్చే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



రామాంజనేయులు (ఫైల్)

తొలిసారి ఇంటి నుంచే ఓటు హక్కు

వినియోగించుకున్న 71 మంది పురంవాసులు

హిందూపురం అర్బన్, మే 5: తొలిసారి వృద్ధులు ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునే విధానాన్ని ఎన్నికల సంఘం తొలిసారి రాష్ట్రంలో ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రవేశపెట్టింది. దీంతో ఆదివారం హిందూపురంలో 71 మంది వృద్ధులు ఓటుహక్కు వినియగించుకున్నారు. పురంలో 73 మంది ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకోగా 71 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంక ఇద్దరు శనివారం మృతి చెందినట్లు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్ తెలిపారు. కాగా పద్ధతి ప్రకారం ఇంటి వద్దకు ఒక పోలింగ్ అధికారి, ఒక అసిస్టెంట్ పోలింగ్ అధికారి, ఆ ప్రాంతం బీఎల్‌ఓ, ఒక పోలీసు, వీడియో గ్రాఫర్ ఉంటారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కం పార్టుమెంట్‌లో ఓటు వేసి దానిని షీల్డు కవర్‌లో ఉంచి బ్యాలెట్ బాక్సులో వేయించారు. దానిని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్ కుమార్‌కు అందించారు. రాజకీయ నాయకుల సమక్షంలో వాటిని బాక్సుల్లో భద్రపరిచారు.

మడకశిరలో 306 మంది దరఖాస్తు

మడకశిర రూరల్: నియోజకవర్గంలోని 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు పోస్టల్ బ్యాలెట్ దారా హోం ఓటింగ్ కోసం 306 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరిశంకర్ రావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 112 మంది, దివ్యాంగులు 194 మంది ఉన్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా సోమవారం వారు హోం ఓటింగ్ వినియోగించునే ఏర్పాటు చేయనున్నట్లు ఆర్‌ఓ తెలిపారు.



సీలు వేసిన బాక్సులను ఆర్‌ఓ వద్దకు తీసుకెళ్తున్న అధికారులు

టీడీపీ ఎన్నికల ప్రచార జోరు

హిందూపురం అర్బన్, మే 5: ప్రజలకు అందుబాటులో ఉండే స్థానికురాలు సవిత కావాలా.... ఎక్కడో రాయదుర్గం, కళ్యాణదుర్గం, బెంగళూరుల్లో ఉండే నాన్‌లోకల్ వ్యక్తి మనకు ఎమ్మెల్యేగా ఉండాలా.. అనే విషయాన్ని మీరు తేల్చాలని టీడీపీ మాజీ జడ్పీటీసీ ధనాపురం సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మారుతి ప్రజలకు పిలుపునిచ్చారు. పరిగి మండల పరిధిలోని కొత్తపల్లి, పీ నరసాపురం, ఎన్ ముద్దిరెడ్డిపల్లి, ఎస్. బీరేపల్లి, ధనాపురం, శిరేకోళం, హొన్నంపల్లి, జగాలపల్లిలలో ఆదివారం పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత తరుపున వారు విస్తృత ప్రచారం నిర్వహించారు. మనకు అందుబాటులో ఉండే ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధికి ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, శేఖర్, మద్దిలేటి, హనుమంతరెడ్డి, మైలారప్ప, శేఖర్‌రెడ్డి, అశ్వర్థప్ప, నంజుండప్ప, బేబి తదితరులు పాల్గొన్నారు.



ధనాపురంలో ప్రచారంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

చిలమత్తూరు: నందమూరి బాలకృష్ణకు మద్దతుగా మండలంలో టీడీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆదివారం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే బాలకృష్ణకు, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధికి మద్దతుగా ఓటుని అభ్యర్థించారు. టీడీపీ మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, మహిళలు ప్రచారంలో పాల్గొన్నారు. చిలమత్తూరులో నాగరాజుయాదవ్, నందీశప్ప, అశ్వత్థప్ప, లక్ష్మీనారాయణయాదవ్, గౌరీశంకర్, ఆంజనేయులు, శివ తదితరులు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలో పొందుపర్చిన విషయా లను వివరించారు. హిందూపురం నియోజకవర్గం అభివృద్ధి చెం దాలన్నా, రాష్ట్రం బాగుండాలన్నా టీడీపీకి ఓటు వేయాలని కోరారు. కోడూరు పంచాయతీలో సోమశేఖర్, శ్రీదేవి, మీసేవ సూరి, గంగాధర్ ఆధ్వర్యంలో, సోమఘట్టలో తిప్పారెడ్డి, లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం జరిగింది. మొరసలపల్లి పంచాయతీలో పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

50 ఏళ్లు నిండిన వారికీ పింఛన్లు అందిస్తాం

రొద్దం : బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు, 50ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ఎల్‌జీబీనగర్, కోగిర, బొక్సంపల్లిల్లో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, జీవీపీ నాయుడు, నరసింహులు, చిన్నప్పయ్య, నరహరి, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, క్లస్టర్ ఇన్‌చార్జ్ నగేంద్ర, ఎల్‌బిజీ ఆంజనేయులు, చిన్న ఆంజనేయులు, రాజన్న, బుడ్డారెడ్డి, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఒక చేత్తో పథకాలు.. మరోచేత్తో దోపిడీ..

పెనుకొండ రూరల్: వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక చేత్తో పథకాలు అందిస్తూనే మరోచేత్తో పన్నుల రూపంలో ప్రజల నుంచి దోపిడీ చేశారని మాజీ జడ్పీటీసీ నారాయణ స్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య విమర్శించారు. వైసీపీ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. మండలంలోని కోనాపురం, ఇస్లాపురం, వెంకటగిరి పాళ్యం, కురుబవాండ్లపల్లి, గుట్టూరు, చిన్నపరెడ్డిపల్లి, మమదేవపల్లి, షీప్‌ఫారం తదితర ప్రాంతాల్లో ఆదివారం టీడీపీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బ్యాలెట్ నమూనాపై అవగాహన కల్పిస్తూ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, ఎంపీ అభ్యర్థి బీకే సైకిల్ గుర్తుకు ఓటేయాలని సూచించారు. టీడీపీ మండల మాజీ కన్వీ నర్ శ్రీరాములు యాదవ్, గుట్టూరు చిన్నవెంకటరాముడు, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు సూర్య నా రాయణ, నారాయణస్వామి, కోనాపురం రామలింగ, కౌన్సిలర్ గీత, హనుమంతు, శివశంకర్, ప్రసాద్, బాబుల్‌రెడ్డి, పోతిరెడ్డి, వీజీ పాళ్యంశీన, నారాయణనాయక్, రమేష్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, సన్నపోతన్న, వీరజిన్న, వడ్డిచంద్ర, చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అగళి/రొళ్ల: తెలుగుదేశం పార్టీ గెలుపే ధ్యేయంగా ముమ్మరంగా ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ తెలిపారు. వారు ఆదివారం మండంలోని అనుమనపల్లి, ఆర్‌జిపల్లి, బొమ్మరసనపల్లి, కోడిపల్లి, ముక్కడంపల్లి, తదితర గ్రామాలలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే రొళ్ల మండలంలోని హులికుంట, వన్నారసపల్లి ఎస్సీ కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర వక్కలిక సాధికార కన్వీనర్ వీఎం పాండురంగప్ప, నాయకులు బూత్‌నెంబర్ 117 పరిధిలో ప్రచారం చేశారు. సీనియర్ నాయకులు రాజ్‌కుమార్, బూత్ ఇన్‌చార్జి నాగరాజు, వద్రహట్టి తిమ్మరాజు, హనుమంతు, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎన్ హొసకోటలో టీడీపీ ప్రచారం



ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

పావగడ, మే 5: తెలుగుదేశం పార్టీ తరఫున ఆదివారం కర్ణాటకలోని వైఎన్‌హొసకోటలో టీడీపీ నా యకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన వైఎన్ హొసకోటలో ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చిన అనేక మంది ఓటర్లు చేనేత కార్మి కులుగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసు కొని కొన్ని సంవత్సరాల నుంచి నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని, ప్రతి ఓటు ఎంతో కీలకం అని భావించారు. దీంతో కంబదూరు సరిహద్దు ప్రాంతంలోని కర్ణాటకలో నివసిస్తున్న ప్రతి ఓటరును కలిసి టీడీపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, సూపర్‌సిక్స్, భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రతి ఇంటికి అందించేలా టీడీపీ అధికారంలోకి వ స్తే కృషి చేస్తుందని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.